# నా అభిమాన తార

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క అభిమానవస్తువో, వ్యక్తో, విషయమో వుండటం సహజం.

కొందరికి బాదంహల్వా ఇష్టం! మరికొందరికి శిరియాలపకోడీ ఇష్టం, ఇంకా కొందరికి ఉప్పుచేపలు ఇష్టం——

అలానే, ఫిలింతారల విషయంకూడా. మనలో ప్రతి వొక్కరికీ వొక్కొక్క అభిమానతార వుంది, స్వప్నవీధులలోకూడా మనల్ని వెంటాడి వస్తూంటుంది——

కొందరికి కాంచనమాల ముక్కు తీరూ, మూతితీరూ ఇష్టం; మరి కొందరికి కన్నాంబ ఒడ్డుపొడుగులు నచ్చుతాయి; ఇంకా కొందరికి పుష్పవల్లి కళ్లలోని అల్లరీ, చిలిపితనం అంటే రోగంపడి లేచినవాడు మాగాయి ముక్కకోసం తపించిపోయినట్టుగా తపించిపోతారు.

ఈసందర్భంలో నా అభిమానతారవిషయం నాలుగుముక్కలు చెప్ప దలుచుకున్నాను——

నా అభిమానతారను మీరెవరూ ఎరగరు. నేను అసలే ఎరగను! తెల్లబోకండి.

నా అభిమానతార వంటింట్లో కుంపటి విసురుతూ వుండేటప్పుడు ఒకరకం 'మేకప్', స్టుడియోలో సెట్టుమీద మరోరకం 'మేకప్' కలిగి వుండదు. అక్కడ కట్టేచీరలే ఇక్కడా, అక్కడ ధరించే ఆభరణాలే ఇక్కడా ఎప్పుడూ, అన్ని వేళలా ధరించివుంటుంది.

నా అభిమానతార ఫిలింలో ఆకర్షణీయంగానూ, ప్రత్యక్షరూపంలో భయంకరంగానూ కనుపించదు. దానిలో, అసలు ఆకర్షణ అనేదీ అందం అనేదీవుంటే అక్కడా వుంటుంది. ఇక్కడా వుంటుంది. ఎక్కడా వుంటుంది——

నా అభిమానతారను తృణీకరించి, దాని మొగుడు మరొకదానితో సరసానికి బయల్దేరడు.

నా అభిమానతార ప్రియుడితో కజ్జాపడి నూతికీ,ఏటికీ పరుగెత్తదు. నిదానంగా ఆలోచించి, ప్రపంచపరిస్థితులను స్థిరచిత్తంతో అర్థం చేసుకుని ప్రవర్తిస్తుంది.

నా అభిమానతారకు మానవులకు సంభవించే కష్టాలవంటివి ఏమైనా సంభవిస్తే అది ఇతర మానవులలాగా ఓర్చుకుని, గత్యంతరం ఆలోచిస్తుందే తప్ప నాలుగు ఏడుపు పాటలు పాడి గల్లంతు చెయ్యదు.

నా అభిమానతారకు ప్రేమబాధ ఎక్కువైతే అది తీర్చుకునే వుపాయమేదో ఆలోచిస్తుందే గాని చెట్లనూ, పుట్లనూ పట్టుకుని 'ప్రేమ నగరమే...' అని వెర్రివేషాలు వేయదు.

నా అభిమానతార ప్రియుడి జేబులో ఏమైనా డబ్బుంటే తీసుకుని చీరలూ, పౌడర్లూ, స్నోలూ కొనుక్కుంటుందే తప్ప తన వొంటిమీద వున్నవి వొలిచి అతడికి యివ్వదు.

నా అభిమానతార తత్వాలు పాడుతూండే సన్యాసిని చూసి మహత్తరమైనవాడనీ, పాటలు పాడుతూండే ముష్టి కుర్రవాడిని చూసి మేనమామ కొడుకనీ ఎప్పుడూ భ్రమపడదు.

నా అభిమానతార తన మొగుడు బజారులో ఏరి తీసుకువచ్చిన అభాగ్యసుందరిని చీపురుకట్టతో బాదుతుందిగాని దాన్ని దగ్గరకు చేరదీసి, దాని కష్టసుఖాలను అడిగి, ఆదరించదు.

నా అభిమానతార మూడుపూటలా సుఖంగా వొండుకుని తాను తిని, పిల్లలకీ మొగుడుకీ పెట్టి జీర్రున చీదకుండా నూరేళ్లు బ్రతుకుంది గాని పాటలతోనూ, పద్యాలతోనూ, ఏడుపులతోనూ, జిజ్ఞాసలతోనూ కరిగి, అరిగిపోదు.

నా అభిమానతార. వెండి తెరమీద కనిపించదు. దానివునికి యదార్థ ప్రపంచంలో.

కుర్ర వెధవకి మతి పోయింది, ఇదంతా చూస్తూంటే—

ఒక రోజు ఉదయం శుభలగ్నమందు కుర్ర వెధవ గుమ్మాలు తుడుస్తూంటే దాసీదాని చెయ్యి పట్టుకున్నాడు—

అది చీపురుకట్ట ఎత్తింది, పాముపడగ ఎత్తినట్టుగా!

---

# అబద్ధం!

శవాన్ని చూసి కొంతమంది బెదుర్తూంటారు-దాన్ని అపశకునంకింద భావిస్తారు-అది తమకు కీడు తీసుకు రాబోతూం దనుకుంటారు. ఇది శుద్ధ అబద్ధం!

నిజానికి, శవాన్ని చూసినవాళ్ళు సంతోషించాలి. ఎందుచేతనంటారా? చచ్చి పోయింది మీరు కాదు గనకనూ మరెవడో అభాగ్యుడు గనకనూ! మీరే చచ్చిపోయినట్లయితే మీకు ఎంత బాధగావుండునూ...? మీరు కాదు చచ్చిపోయింది-ఇంకోవాడు. అతడి స్థానంలో మీరు లేక పోయినందుకు మీరు నిజంగా సంతోషించాలి-సంతోషించండి!

* * *

త్రాచుపాము మీ కాళ్ళముందరనుంచి ప్రాకుతూ పోయింది. మీ గుండెలు టపటప మంటూ తుపానుగాలిలో చిక్కిన గాలిపడగలా కొట్టుకుంటాయి. భయంతో మీ జుట్టు లేచి నించుంటుంది. మీకు కీడు జరిగిందను కోవడం అబద్ధం.

ఎందుచేత నంటారా?

అది మిమ్మల్ని కరవకుండా పోయింది గనక, అదే మిమ్మల్ని కరిస్తే...? వెళ్ళి, స్నేహితులకి టీపార్టీ చెయ్యండి?

* * *